29న న్యాయవాదుల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - రాయచోటి

ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆదేశాల మేరకు ఈనెల 29న రాయచోటి బార్ అసోసియేషన్ సాధారణ ఎన్నికలు నిర్వహించేలా రాయచోటి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షులు ఎస్. ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.రెడ్డయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలు నిర్వహించడానికి సీనియర్ న్యాయవాది అయిన కె.రాజకుమార్‌రాజును అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా, ఇలియాస్ బాషను ఎగ్జిక్యూటివ్ కమిటీగా నియమించినట్లు వారు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే న్యాయవాదులు నామినేషన్లు వేయడానికి ఈనెల 20, 21, 22 మూడు రోజులు ఉంటుందని, 24న నామినేషన్ల పరిశీలన, 25న నామినేషన్ ఉపసంహరించుకోడానికి సమయం ఉంటుందని, 29న ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు ఓటు హక్కు ఉన్న న్యాయవాదులందరూ ఓటింగ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. అదే రోజు ఐదు గంటలకు కౌంటింగ్ మొదలుపెట్టి ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారన్నారు.

వేగవంతంగా భూముల రీసర్వే

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రీ సర్వేపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని బూడిదవేడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 535/2లో మహిళా రైతు అలివేలమ్మకు చెందిన 4.77 ఎకరాల రీ సర్వేను పరిశీలించారు. గ్రామంలో ఎన్ని వేల ఎకరాలు ఉన్నాయి, అందులో డ్రైలాండ్, వెట్ ల్యాండ్ విస్తీర్ణం ఎంత, రీసర్వే ఎప్పుడు మొదలుపెట్టారు, ఎన్ని టీములు సర్వే చేస్తున్నాయి, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలలో రీసర్వే చేశారు, ఇంకెంత చేయాలి అన్న వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రీసర్వే చేయాల్సిన భూములు 2,028 ఎకరాలు ఉన్నాయని, గ్రామంలో 3 టీములు ద్వారా జనవరి 20న సర్వే ప్రక్రియ ప్రారంభించామని, ఇప్పటివరకు వేయి ఎకరాలకు పైగా రీ సర్వే పూర్తి చేసినట్లు తహశీల్దార్ ఎస్.షామలేటి కలెక్టరుకు వివరించారు. గ్రామ మ్యాపులు, రీ సర్వే చేయాల్సిన ఎకరాల మ్యాపులు కలెక్టర్ పరిశీలించారు. ఒక రోజులో ఎన్ని ఎకరాలు చేస్తున్నారు? రైతులకు నోటీసులు ఇచ్చారా, ఈరోజు ఎంత మంది రైతులకు ఇచ్చారు, ఎంతమంది రైతులు వచ్చారు, నేడు ఎన్ని ఎకరాలు సర్వే పూర్తి చేశారని కలెక్టర్ ప్రశ్నించగా? రోజుకు 50 నుండి 60 ఎకరాలు సర్వే చేస్తున్నామని, ఈ రోజు 9 మంది రైతులకు నోటీసులు ఇవ్వగా వారి ఎనిమిది మంది రైతులు హాజరైనట్లు మండల సర్వేయర్, విఆర్ఓ కలెక్టర్‌కు వివరించారు. రీ సర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, పట్టా భూములు, తదితరాలను పక్కగా సర్వే చేయాలని చెప్పారు. ఎరోజుకారోజు వెబ్లాండ్‌లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులతో సర్వే ప్రక్రియపై ముఖాముఖి మాట్లాడారు. వారికున్న విస్తీర్ణం, సర్వే చేసిన కొలతలు సరిపోతున్నాయా అని రైతులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సరిపోతున్నట్లు రైతులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం సర్వే ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయడానికి అధికారులకు కలెక్టర్ తగు సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్, మండల సర్వేయర్, విఆర్ఓ, విఆర్ఏలు, డిఆర్ఎస్‌లు, రైతులు పాల్గొన్నారు. **గుర్రంకొండ :** తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. భూమి రీసర్వేకి సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని టి.పసలవాండ్లపల్లిలో రీ సర్వే ప్రక్రియ జరుగుతోందని, గ్రామాన్ని 11 బ్లాకులుగా ఏర్పాటు చేసుకున్నామని, 3356 ఎకరాలు సర్వే చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

మహిళపై దాడి హేయమైన చర్య

- నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుర్రంకొండ ఎస్ఐని సస్పెండ్ చేయాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ఆస్పత్రిలో బాధితురాలని పరామర్శిస్తున్న సిపిఎం, ఆర్‌జిఎస్, బాస్ నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గుర్రంకొండ మండలం, శీలంవారిపల్లెలో గిరిజన మహిళ అలివేలమ్మపై జరిగిన దాడి హేయమైన చర్యగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు తెలిపారు. ఈ ఘటనను సిపిఎం తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారం రోజులుగా పెత్తందార్ల దాడిలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన మహిళ అలివేలమ్మను సిపిఎం నాయకులు శ్రీనివాసులు, హరింద్రనాథ్ శర్మ, నాగరాజు, రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపకులు కోనేటి దివాకర్, బాస్ నేత ముత్యాల మోహన్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆమెపై జరిగిన దాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ అలివేలమ్మ ఒకే కుటుంబం శీలంవారిపల్లెలో ఉంటుందని, ఆమెను అక్కడి నుంచి పంపించేయాలని దురుద్దేశంతో బాలకృష్ణ, సుధాకర్ ఆకారణంగా గొడవ పెట్టుకుని ఆమెను జుట్టు పట్టి, రోడ్డుపై ఈడ్చుకుంటూ, వివస్త్రను చేసే విచక్షణారహితంగా దాడి చేసి కొట్టి హత్యాయత్నానికి పాల్పడడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయమన్నారు. దాడిని అడ్డుకోబోయిన కోడలు బాలింతని కూడా చూడకుండా దాడి చేశారంటే ఎంతటి తెగించారో అర్థం చేసుకోవచ్చన్నారు. బాధిత మహిళకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు నిందితులను కాపాడ్డానికి అగ్రహారాన నిలవడం ఏంటని ప్రశ్నించారు. నిందితులను కాపాడేందుకు కేవలం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. బాధితులకు న్యాయం చేయడంలో పోలీసులు తీవ్రంగా విఫలం చెందారని, ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన గుర్రంకొండ ఎస్ఐని వెంటనే సస్పెండ్ చేసి డిఎస్‌పి స్థాయి అధికారిని విచారణకు ఆదేశించాలన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుతో పాటు హత్యాయత్నం కేసు, లైంగిక వేధింపులు చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాసంఘాలను కూడగట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందించి, మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఎస్‌సి, ఎస్‌టిలపై చిన్నచూపు తగదు : ఎస్‌సి, ఎస్‌టిలపై చిన్నచూపు తగదని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు అన్నారు. ఆస్పత్రిలో అలివేలమ్మను పరామర్శించి మాట్లాడుతూ సుధాకర్, బాలకృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గాలివీడు : తూముకుంట సోలార్ పరిశ్రమకు భూములు ఇచ్చిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సోలార్ పరిశ్రమ భూనిర్వాసితుల గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది. దిగువమూలపల్లె రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూముకుంట గ్రామ పంచాయతీ దిగువమూలపల్లిలో 60 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారన్నారు. 40 సంవత్సరాల నుండి సాగులో ఉన్న భూమి సోలార్ ప్రాజెక్టు పేరుతో భూములు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధపడిందని పేర్కొన్నారు. వారందరికి 2013 భూసేకరణ చట్ట ప్రకారం నష్ట పరిహారం చెల్లించిన తర్వాతే భూములు తీయనుకోవాలని పేర్కొన్నారు. భూ నిర్వసితులకు నష్టపరిహారంతో పాటు భూమికి భూమి, ఆర్‌అండ్‌అర్ ప్యాకేజీ, ఒక ఇంటికి ఉద్యోగం పునరావాసం ప్రభుత్వాలు ఇస్తాయన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు గ్రామంలో ఎటువంటి దండోరా చాటింపు వేయకుండా, అవగహన మీటింగుజరపకుండా భూమి గల రైతులకు నష్ట పరిహారం చెల్లిచకుండానే నేరుగా సోలార్ నిర్వాహకులు భూమిలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారంటే రైతులకు ద్రోహం చేయడం కాదా అని ప్రశ్నించారు. రైతులకు న్యాయం జరిగే వరకు సిపిఎం పోరాటలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, సీనియర్ నాయకులు టి.హరిశర్మ, మాధవయ్య, భాస్కర్, సిఐటియు నాయకులు ఓబుళమ్మ లక్ష్మీదేవమ్మ పాల్గొన్నారు

21న జాబ్ మేళా

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, అన్నమయ్య జిల్లా వారి అధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ అభ్యర్థులకు ఈనెల 21న ఉదయం 9 గంటలకు సాయి కళాశాలలో ప్రముఖ కంపెనీలతో ఉద్యోగ మేళా నిర్వహిస్తారని జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ హోదాలలో పనిచేయడానికి పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటిఐ, డిప్లమా, బిటెక్ చదివి ఉండాలన్నారు. 18 సంవత్సరాల నుంచి 34 సంవత్సరాలు వయసు కల్గిన వారు అర్హులన్నారు. తెలిపిన కంపెనీలో ఎంపికైన నిరుద్యోగ అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి 30 వేల వరకు హోదాను బట్టి వేతనం ఇస్తారన్నారు. విద్యార్హతలకు సంబంధించిన ధృవ పత్రాలు, ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు ఉద్యోగ మేళాలో పాల్గొని అర్హతకు తగిన ప్రయివేట్ ఉద్యోగం పొందాలన్నారు.

రామకృష్ణ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: పుంగనూరు నియోజకవర్గం కృష్ణాపురంలో హత్యకు గురైన టిడిపి కార్యకర్త రామకృష్ణ కుమారుడు సురేష్‌కు టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. మంగళవారం టిడిపి కార్యాలయలంలో ఆయన మాట్లాడుతూ తాను రూ.10 వేలు, పి.సతీష్ కుమార్ రూ.10 వేలు, చంద్రారెడ్డి రూ.5 వేలు, రమేష్ రూ.5 వేలు, మరికొంత మంది రూ.20 వేలు పోగుచేసి అందించారు. టిడిపి సానుభూతి పరుడైన రామకృష్ణను వైసిపి నాయకుడు పట్టపగలే కొడవలితో హత్య చేయడం పాశవిక చర్య అన్నారు. టిడిపికి కోటిమంది కార్యకర్తలు ఉన్నారని, ఎవరికైనా ఇలాంటి ఆపద వచ్చినప్పుడు ఆదుకోవడానికి టిడిపి నాయకులు ముందుంటారన్నారు.కార్యక్రమంలో మధుబాబు, వెంకటరమణ, మధు, నరసింహారెడ్డి, గణేష్ బాబు, రాజన్న, చెంగారెడ్డి, రమణ పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ వద్దు.. రాజ్యాంగమే ముద్దు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్‌సి ఎబిసిడి వర్గీకరణ వద్దు.. భారత రాజ్యాంగమే ముద్దు అంటూ మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట మాలమహానాడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాయలసీమ మాలమహానాడు కార్యదర్శి యమల చంద్రయ్య మాట్లాడుతూ రాజకీయ పార్టీ నాయకులు కొందరు తమ రాజకీయ లబ్ధికోసం అన్నదమ్ములుగా ఉన్న మాల మాదిగలను ఎబిసిడిలుగా వేరు చేయడం శోచనీయమన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న ఎస్‌సి వర్గీకరణను రద్దు చేయడంతో పాటు క్రిమిలేయర్ ను రద్దు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం మాల మహానాడు అధికార ప్రతినిధి మల్లెల మోహన మాట్లాడుతూ ఎపిలో చంద్రబాబుకు మాలలపై కక్షవద్దని, ఇకనైనా ఎబిసిడి వర్గీకరణ నిలుపుదల చేయాలన్నారు. అలా చేయని పక్షంలో రాష్ట్రంలో మాలలంతా కూడగట్టుకుని అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు ఉమ్మడి చిత్తూరు జిల్లాల ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, అధికార ప్రతినిధి మల్లెల మోహన్, అన్నమయ్య జిల్లా జాయింట్ సెక్రెటరీ మాణిక్యం, మదనపల్లి డివిజన్ అధ్యక్షులు కందూరు లక్ష్మీపతి, మదనపల్లి మండల అధ్యక్షులు రామచంద్ర, మాల మహానాడు నాయకులు అప్పయ్య, ప్రశాంత్, అమర, శేషాద్రి, చలపతి, సిటిఎం రమణ, గంగాధర్, గంగరాజు, ఉమాపతి, గురుమూర్తి వేణుగోపాల్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఎండలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వడ దెబ్బపై విద్యార్థులు అవగాహన అవసరమని హెల్త్ ఎడ్యుకేటర్ మొహమ్మద్ రఫీ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలమేరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వడ దెబ్బపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండ తీవ్రత పెరుగుతూ ఉండడంతో ప్రభుత్వం ఒంటి పూట బడులు నిర్వహిస్తుందన్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే చదువుకోవడం, నిద్ర పోవడం చేయాలన్నారు. ఎండలో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఆటలు ఆడడం వల్ల వడదెబ్బకు గురవుతారన్నారు. ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్లు తిరగడం, విరోచనాలు, వాంతులు, నోరు ఆరిపోవడం అపస్మారక స్థితిలోకి వెళ్లడం వంటి లక్షణాలు ఉంటాయని చెప్పారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లటి నీడ ప్రదేశంలోకి తీసుకెళ్లాలని, మెలకువలో ఉంటే ఉప్పు కలిపిన మజ్జిగ తాగించాలని సూచించారు. ముఖానికి చల్లటి నీటితో కడగాలని, గాలి తగిలే విధంగా ఫ్యాన్ కింద కూర్చోబెట్టి వీలైతే మాట్లాడిస్తూ ఉండాలన్నారు. వెంటనే 108కి కాల్ చేసి దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళకూడదు అని బయటకు వెళ్ళినప్పుడు గొడుగు తప్పనిసరిగా తీసుకువెళ్లాలన్నారు. గంట గంటకు నీరు తాగుతూ ఉండాలని ఇంట్లో కిటికీలు తెరిచి ఉండాలన్నారు. నల్లని బట్టలు వేయకూడదని, కాటన్ బట్టలు వదులుగా ఉన్నవి వేసుకోవాలని, దూర ప్రయాణాలు చేయకూడదని, బాలింతలు పిల్లలు వృద్ధులు వడదెబ్బపై జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి కృష్ణకుమార్ నామినేషన్

నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కృష్ణ కుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి మంగళవారం సీనియర్ న్యాయవాది సింగంశెట్టి కృష్ణకుమార్ ప్రధాన ఎన్నికల అధికారి సురేష్ కుమార్, సహాయ ఎన్నికల అధికారి గోవర్ధన్ రెడ్డిలకు నామినేషన్ పత్రాలు అందజేశారు. వీరికి ప్రతిపాదకులుగా అనుగోలు వెంకటసుబ్బయ్య, బాసినేని రమేష్ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కృష్ణ కుమార్ మాట్లాడుతూ తాను అధ్యక్ష పదవికి ఎన్నిక అయితే సీనియర్ న్యాయవాదుల సలహాలు, సూచనలతోనూ జూనియర్ న్యాయవాదుల సహకారంతోనూ కోర్టులోని ప్రధాన సమస్యలైన న్యాయమూర్తుల కొరత, కోర్టు కొరకు కొత్త భవనాలు, న్యాయవాదులకు ఇంటి స్థలాల సాధన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు టి.లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు కందుల వెంకటరమణ, గుండ్లూరు రమేష్ నాయుడు, బండారు సులోచన, విశ్రాంత న్యాయమూర్తి రామాంజనేయులు, మన్నేరు వెంకటసుబ్బయ్య, కత్తి సుబ్బారాయుడు, రవిశంకర్, భరత్ కుమార్ రెడ్డి, మల్లిఖార్జున, నాగేంద్ర ప్రసాద్, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యానికి ఎసి, బీరువా వితరణ చేస్తున్న దాతలు

పంచాయతీ కార్యాలయానికి ఎసి వితరణ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు గ్రామపంచాయతీ కార్యాలయానికి తెలుగు దేశం పార్టీ రాష్ట్ర బిసి కార్యదర్శి పురం రామ్మూర్తి ఏసి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పోలిశెట్టి సురేంద్ర బీరువాను మంగళవారం వితరణ చేశారు. ఈ సందరేగా దాతలు పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ మండు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఈవో కార్యాలయంలో సౌకర్యార్థంగా ఏసి ని, కార్యాలయానికి సంబంధించి ముఖ్యమైన రికార్డ్స్ భద్రపరచుకోవడానికి బీరువా వితరణ చేశామని అన్నారు. పంచాయతీ ఈవో వై. గురు మోహన్ మాట్లాడుతూ నాయకులు, దాతలు కార్యాలయానికి ఏమి చేసినా అది ప్రజాసేవ కిందికే వస్తుందని అన్నారు. పురం రామ్మూర్తి, పోలిశెట్టి సురేంద్ర చేసిన వితరణ భవిష్యత్తు తరాలకు కూడా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు ఎన్. అమర్నాథ్ రెడ్డి, పీలేరు మండల తెలుగు యువత అధ్యక్షులు నల్లారి రియాజ్, ఏబీఎస్ రాజు, మనోహర. మాజీ ఉప సర్పంచ్ మహమ్మద్ పీర్, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితులు పాల్గొన్నారు.

దళితులపై దాడి బాధాకరం : బిఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి

మదనపల్లి మండలం వలసపల్లె పంచాయతీ, భోగ్గిటివారిపల్లెలో దళితులపై దాడి చేయడం బాధాకరమని, వెంటనే వారిని అరెస్టు చేయాలని బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు అబ్బవరం యుగంధర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఎస్‌పి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ ఈనెల 9న మదనపల్లి మండలం, బొగ్గిటివారిపల్లెలోని ప్రభుత్వ స్థలంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించడానికి ఎస్‌సి మాల సామాజికి వర్గానికి చెందిన టి.నారాయణ, టి.కృష్ణవేణి, టి.రత్నమ్మ మిగతా గ్రామస్తులతో కలిసి చట్టబద్ధంగా యత్నించారని చెప్పారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వాల్మీకి సామాజకవర్గానికి చెందిన పి.ఆదినారాయణ, పి.వెంకటేశు, బి.నరసింహులు, కె.శ్రీనివాసులు, పి.శ్రీరాములు, పి.శ్రీనివాసులు, పి.లక్ష్మీనారాయణ, బి.చెల్లప్ప, బి.శంకర, బి.రవి, బి.అంజమ్మ, కె.నరసమ్మ, పి.దేవమ్మ, పి.శాంతమ్మ, బి.రెడ్డమ్మ కలిసి అంబేద్కర్ కేటాయించిన స్థలంలో గుడి ఏర్పాటుకు భూమిని చదును చేశారని పేర్కొన్నారు. అక్కడికి వెళ్లి అడిగితే ఒక్కసారిగా వారు దళితులపై కర్రలతో దాడి చేస్తూ దుర్భాషలాడారని వాపోయారు. బాధితులను అవమానించిన పోలీసులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ మహేష్ బాబు, మదనపల్లి నాయకులు ఎం ప్రశాంత్, బహుజన నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ఘనంగా ఫార్మా-డి ఉత్సవాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం ఫార్మా-డి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అన్నమాచార్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ సాయిబాబారెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి పాల్గొని మాట్లాడారు. తమ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు విదేశాలలో గొప్ప స్థాయిలో స్థిరపడ్డారని, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రస్తుతం విద్య పూర్తి కాబోయే విద్యార్థులు ఆ స్థాయికి చేరుకోవాలని సూచించారు.

లక్ష్య సాధనకు పట్టుదల అవసరం : ఎంఇఒ

బాలు వికాస్‌ను సత్కరిస్తున్న ఎంఇఒ, విఎస్ఎన్ సిద్ధార్థ కరస్పాండెంట్

ప్రజాశక్తి-పీలేరు

మనిషి అనుకున్నది సాధించాలన్న తపన ఉంటే సరిపోదని, లక్ష్య సాధనకు తగిన క్రమశిక్షణ, కృషి, పట్టుదల, ఏకాగ్రత, అంకిత భావం కూడా చాలా అవసరమని జొన్నగడ్డల బాలు వికాస్ నిరూపించాడని ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం విఎస్ఎన్ సిద్ధార్థ విద్యాసంస్థలో, ఆ సంస్థ అధినేత్రి వడ్లమూడి మాధవి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సిజిఎల్ 2024 పరీక్షలో అప్రతిభ చాటి, జిఎస్‌టి ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైన తమ పాఠశాల పూర్వ విద్యార్థి జొన్నగడ్డల చలపతి రాజు, అన్నపూర్ణ దంపతుల కుమారుడు బాలు వికాస్‌కు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ మాట్లాడుతూ బాలు వికాస్ సిజిఎల్ పోటీ పరీక్ష జనరల్ కేటగిరిలో జాతీయస్థాయి 1173వ ర్యాంకు సాధించి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జిఎస్‌టి అండ్ సెంట్రల్ ఎక్సైజ్‌కు ఎంపికవడం హర్షించదగ్గ విషయమన్నారు. తన ఉన్నతి కోరీ వెన్నంటి ఉంటూ ప్రోత్సాహం అందించిన తండ్రిని కోల్పోయిన బాధ తన గుండెల నిండా ఉన్నా, ఆ దుఃఖాన్ని మనసులోనే థ్యాంక్స్ దాచుకుంటూ, వేదన పడకుండా తన తండ్రి కోరికను తీర్చాలన్న లక్ష్యంతో బాలు వికాస్ కంబైండ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షలో సత్తా చాటి తండ్రికి అంకితం చేశాడని కొనియాడారు. తండ్రి జొన్నగడ్డల చలపతి రాజు, తల్లి అన్నపూర? దంపతులు తమ కొడుకు ఉజ్వల భవిష్యత్తు కోరి బాల్యం నుంచి కూడా మంచి విద్య, క్రమశిక్షణ అందిస్తూ తీర్చిదిద్దడం ప్రశంసనీయమని చెప్పారు. విఎస్ఎన్ విద్యా సంస్థల అధినేత్రి వడ్లమూడి మాధవి మాట్లాడుతూ వికాస్ పదిలో 10/10 గ్రేడింగ్ సాధించి నాడు, ఎలాంటి శిక్షణ పొందకుండానే సొంతంగా చదివి ఎస్ఎస్‌సి, సిజిఎల్-2024 పరీక్షలో అద్భుత విజయాన్ని సాధించి నేడు, తమ పాఠశాలతో పాటు పీలేరు పట్టణానికి, తన తల్లిదండ్రికి, చదువు నేర్పిన గురువులకు మంచి పేరు, ప్రఖ్యాతి తెచ్చిపెట్టాడని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో బాలు వికాస్ మరెన్నో ఉన్నత హోదాల్లో విజయాలు సాధించాలని కోరారు. ఈ సందరేగా ఎంఇఒ లోకేశ్వర్ రెడ్డి, విఎస్ఎన్ సిద్ధార్థ అభినేత్రి మాధవి బాలు వికాస్‌కు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సి.ఆర్.పి జలకనూరి మురళీధర్ రాజు, పాఠశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే కఠిన చర్యలు

- ఇంటి పన్ను వసూళ్లకు కాలనీని చుట్టుముట్టిన అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం, దళితులు నివాసం ఉంటున్న గాంధీపురంలో మున్సిపల్ అధికారులు మంగళవారం హల్ చల్ చేశారు. ఇంటి పన్నుల వసూళ్ల నిమిత్తం అధిక సంఖ్యలో సిబ్బంది, అధికారులు గాంధీపురాన్ని చుట్టుముట్టి ఇంటింటికి వెళ్లి ఇంటి పన్ను కట్టాలని లేదంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దళితులు నివాసమున్న గాంధీపురంలో అందరూ కూలీనాలీ చేసుకుని జీవనం చేసేవారే. రెక్కాడితేకానీ డొక్కాడని కుటుంబాలు వారివి. అయితే ఇంటి పనులు కట్టకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రతిరోజు ఇంటి తలుపులు తట్టడం, మంగళవారం రోజున ఏకంగా మున్సిపల్ కమిషనరే రంగంలోకి దిగడం, అధిక సంఖ్యలో అధికారులు రావడంతో ఇక్కడ ప్రజలు ఒకింత ఆందోళనకు గురయ్యారు. పన్ను కట్టకపోతే ఏమి చేస్తారోనన్న భయాందోళనలకు గురయ్యారు. మున్సిపల్ కమిషనర్ ప్రమీల అధికారులతో గాంధీపురంలో ఇంటింటికి తిరగడంతో ఇక్కడి వాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటిపన్ను కచ్చితంగా కడుతామని, అయితే తమకు సమయం కావాలని చెబుతున్న సచివాలయ సిబ్బంది రోజు ఇంటి తలుపు కొడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు. పట్టణంలో పెద్దపెద్ద అపార్ట్మెంట్స్, కమర్షియల్ కాంప్లెక్స్ వ్యాపారస్తులు, ఉద్యోగస్తులు, మున్సిపల్ కాంప్లెక్స్‌లలో అద్దెకుంటున్నవారు, రాజకీయ పలుకుబడి ఉన్నవారు ఇలా ఎంతోమంది లక్షల్లో బకాయిలు ఉన్న వారి నుంచి బకాయలు వసూలు చేయడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారు. కారణం వారికి పలుకుబడి, పార్టీలు, రాజకీయ నాయకుల అండ ఉండడమే కారణం. అయితే ఏ పలుకుబడి లేని కూలీనాలీ చేసుకుని, జీవనం సాగిస్తున్న కుటుంబాలపై ఇంటి పన్నులంటూ ఏక ధాటిగా అధికారులందరూ మీద పడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సంయమనం పాటించాలని, ముఖ్యంగా స్లం ఏరియాలలో, దళితులు నివసిస్తున్న ప్రాంతాలలో కాస్త ఓపిగ్గా పన్నులు వసూలు చేయాలని పలువురు సూచిస్తున్నారు.

పన్నుల వసూళ్ల కోసం గాంధీపురాన్ని చుట్టుముట్టిన మున్సిపల్ అధికారులు

మాట్లాడుతున్న నరసింహారెడ్డి

ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నిరకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిఆర్‌టి హైస్కూల్‌లో మంగళవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ లీడర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్‌లో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను ఈనెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించాల్సిన స్కౌట్ కార్యకలాపాల గురించి వివరించారు. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలను పెంపొందించు కునేందుకు స్కౌట్ శిక్షణ దోహద పడుతుందని అన్నారు. ఈ మధ్యనే రోడ్డు ప్రమాదంలో మరణించిన స్కౌట్ మాస్టర్ వెంకటరమణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, ఎఎస్ఒసి లక్ష్మీకర్, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్స్ మహమ్మద్ ఖాన్, రవీంద్రారెడ్డి, స్కౌట్ కమ్యూనిటీ డెవలప్మెంట్ సభ్యులు లక్ష్మిరెడ్డి, స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టన్స్, కబ్ మాస్టర్స్, ఫ్లాక్ లీడర్స్ పాల్గొన్నారు.

నేడు ఆదరణ-3 పథకంపై సమీక్ష

ప్రజాశక్తినిమ్మనపల్లి

ఆదరణ-3 పథకంపై సమీక్ష సమావేశాన్ని ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బిసి కుల వృత్తులకు, చేతివృత్తులకు అవసరమైన ఆధునిక పనిముట్లను ప్రభుత్వం అందించనుందని, అందుకు అవసరమైన సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. బిసి కులవృత్తులు, చేతివృత్తుల సంఘాల నాయకులు, నాయి బ్రాహ్మణులు, రజకులు, వడ్డెర, మత్స్యకారుల, చేనేత, స్వర్ణకారుల, వడ్రంగి, పాల వ్యాపారం, కల్లుగీత కార్మికుల, కుమ్మరి, మేదర, వాల్మీకి బోయ, కృష్ణ బలిజ పూసల వారు, సగర ఉప్పర, శిల్పి పనివారు, విద్యుత్, ప్లంబింగ్ పనిచేసే ప్రజలు బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొని తమ సూచనలను, సలహాలను తెలపాలని కోరారు. ఈసమావేశాన్ని బిసిలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధితుడికి టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని చిట్లూరు పంచాయతీ దళితవాడకు చెందిన చిట్లురు శివ శంకర్ పెయింట్ పని చేస్తూ మంగళవారం ప్రమాదంలో గాయపడ్డారు. గాయపడిన వ్యక్తి చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మండల టిడిపి నాయకులు గాలివీటి సురేంద్రరెడ్డి, నాగిరెడ్డి, దేవ దర్శన్‌రెడ్డి, జిల్లా ఎస్‌సి, ఎస్‌టి మాండరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ చికిత్స పొందుతున్న శివశంకర్ ను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని రాజుకుంట, చింతచిలక గ్రామాల్లో మంగళవారం స్థానిక వైద్యాధికారులు అన్సారీ, సూపర్వైజర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇటీవల రెండు గ్రామాలలో కొంతకాలంగా విష జ్వరాలు, కీళ్ల నొప్పులు విపరీతంగా ఉండటంతో మెడికల్ క్యాంపు నిర్వహించి, మలేరియా, డెంగీ వ్యాధులకు సంబంధించి రక్త పరీక్షలు చేసినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ అన్సారీ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రత ఎంతో ముఖ్యమని, దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండా లని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పిఇ నిహారిక, మంజుల, ఎఎన్ ఎంలు ఫరీదా, శాంతకుమారి, ఆశాలు సక్కుబాయి, ప్రభావతి మెడికల్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న కార్మికులు

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-పీలేరు

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మంగళవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని మూన్ లైట్బా దా సమీపంలో కార్పెంటర్ అసోసియేషన్, బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్, బిస్మిల్లా వెల్డర్స్ యూనియన్, బిస్మిల్లా ఆటో యూనియన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. కఠోర ఉపవాస దీక్షలో ఆచరిస్తున్న 600 మంది ముస్లిములకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్, బిస్మిల్లా వెల్డర్ యూనియన్, బిస్మిల్లా ఆటో యూనియన్‌ల నాయకులు సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రెడ్డిబాబు, కార్యదర్శి అంబికాపతి ఆచారి, కోశాధికారి శంకరాచార్య, గౌరవ సలహాదారుడు వేణు ఆచారి, గౌరవ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ఫారుక్ బాష, మోదిన్ బాష, గౌస్పీర్, కమాల్ బాషా, మునిరాజు, షేక్ సుభాన్ బాష, ఆటో యూనియన్ నాయకులు బోదేషావలి, షేక్ అబిదుల్లా పాల్గొన్నారు.

పథకాలను రైతులకు చేరువ చేయాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే పథకాలను రైతులకు చేరువ చేయాలని ముద్దనూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఎడిఎ ఆధ్వర్యంలో ఎఒ వెంకట కృష్ణారెడ్డి క్షేత్రస్థాయి సిబ్బందితో పథకాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ, ఎఒ మాట్లాడుతూ ప్రభుత్వ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. పంట నమోదు సోషియల్ ఆడిట్ గ్రామ సభల ఫొటోలు, వీడియోలను ఉన్నతాధికారులకు వివరాలు పంపాలన్నారు .రైతు రిజిస్ట్రీ కానీ వారిని గుర్తించి చేయాలన్నారు. రాయితీ ద్వారా ఇచ్చే పివిసి పైపులు కుటుంబంలో ఒకరికి మాత్రమే రూ.15వేలు రాయితీ ఇస్తుందన్నారు. పంటకోత ప్రయోగాలకు సంబంధించిన ఫారాలను అందజేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మామిడి పూతకు తెగుళ్ల దెబ్బ

- పేనుబంకతో రాలుతున్న పూత, పిందెలు
- అధిక దిగుబడిపై రైతుల్లో ఆందోళన

విరగబూసిన మామిడిపూతకు పట్టిన తెగుళ్లు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఉద్యానవన పంటల్లో ప్రముఖమైన మామిడిపంటకు తెగుళ్ల దెబ్బ తగిలింది. కొత్త,కొత్త తెగుళ్లతో మామిడి రైతులు తల్లడిల్లిపోతున్నారు. వాతావరణం అనుకూలించకపోవడం, కొత్తకొత్త తెగులు రావడంతో ఏమి చేయాలో పాలుపోక లబోదిబో మంటున్నారు. నిన్నటి వరకూ మామిడి చెట్లకు పూత రాకపోవడంతో రైతులు ఆందోళన గురయ్యారు. ఇప్పుడు ఆపూత పిందెను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు.ప్రస్తుతం పేనుబంక సోకడంతో దాని నివారణకు రకరకాల మందులు పిచికారీ చేస్తున్నారు. బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, కురబలకోట, పెద్దమండ్యం మండలాల్లో సుమారు వందల ఎకరాలకుపైగా మామిడి తోటలు సాగవుతున్నాయి. ప్రస్తుతం మామిడి చెట్లకు పేను బంక ఆశిస్తోంది. దాని నివారణకు రకరకాల మందులు వినియోగిస్తున్నారు. రోజురోజుకూ మారుతున్న వాతావరణం కారణంగా మామిడి తోటల పరిస్థితి అనుకూలంగా లేదు. ఒకరోజు విపరీతంగా మంచు పడుతోంది. మరో రోజూ ఎండతీవ్రత అధికంగా ఉంటోంది. ఈ పరిస్థితుల కారణంగా తెగుళు మామిడి చెట్లకు సోకుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది మామిడి కాయల ధరలు ఎక్కువగా ఉంటాయని రైతులు భావిస్తున్నారు. మామిడి కాయలను కాపాడుకొనేందుకు రైతులు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేల పైగా ఖర్చుపెట్టి తెగుళ్ల నివారణకు మందులు కొట్టారు.పేనుబంక వల్ల మామిడి ఆకులు నల్లగా వస్తున్నట్లు రైతులు తెలిపారు. పూతను తినడం వల్ల అది నల్లగా మారి రాలిపోతున్నట్లు పేర్కొన్నారు. పూత రాలిపోవడం వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. పూత నిలిచి పిందెలు, కాయలు వస్తే మంచి ధరలు వస్తాయని అనుకుంటే పేను బంక రూపంలో ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. గత ఏడాది దిగుబడి లేక తీవ్రంగా నష్టపోయామని, కనీసం ఈ ఏడాదైనా మంచి పంట చేతికి వస్తే కష్టాల నుండి గట్టెక్కవచ్చునని మామిడి రైతులు భావిస్తున్నారు. ఉద్యానవన అధికారులు స్పందించి తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పూతకు పట్టిన తెగుళ్ల చూపిస్తున్న రైతు జనార్దన్

గంగమ్మ జాతరకు తొలగిన ఇక్కట్లు

- గుగ్గిళ్ల వెంకటరమణయ్య కుటుంబీకులకు బాధ్యతలు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

'గంగమ్మ జాతరకు తొలగని ఇక్కట్లు' అనే శీర్షికతో సోమవారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. గంగమ్మ జాతర నిర్వహణకు మార్గం సుగమమైంది. జాతర నిర్వహణకు సంబంధించిన మూడు కుటుంబాల పెద్దలు సోమవారం రాత్రి సమావేశమై ఈ ఏడు జాతర నిర్వహణ ఎవరు చేయాలన్న అంశంపై చర్చించారు. గుగ్గిళ్ళ వంశంలోని ఇరు కుటుంబాల వారు, బోనం కుటుంబీకులు, సంజీవపురం కుటుంబీకులు కలిసి గ్రామస్తుల సమక్షంలో సుదీర్ఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గుగ్గిళ్ల కుటుంబాలలోని ఇరువర్గాల వారు ఒకే తాటి పైకి వచ్చి గుగ్గిళ్ల చిన్నయ్య కుటుంబీకులు గుగ్గిళ్ల సుబ్బారాయుడు, గంగయ్య ఈ ఏడాది గుగ్గిళ్ళ వంశంలోని వెంకటరమణయ్య కుటుంబీకులలో రెడ్డికృష్ణకు జాతర నిర్వహణ పగ్గాలు అప్పజెప్పినట్లు సమాచారం. గంగమ్మ జాతరకు ఏర్పడిన ఇక్కట్లు తొలగిపోయినట్లేనని, ఉగాది తర్వాత జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జాతర పటిష్టంగా నిర్వహిస్తాం

తమ కుటుంబానికి జాతర నిర్వహణ బాధ్యతలు రావడం ఆనందంగా ఉందని గుగ్గిళ్ల రెడ్డిశివ పేర్కొన్నారు. అందరినీ సమన్వయ పరుచుకుని ఎటువంటి పొరపాట్లు లేకుండా గంగ జాతర పక డ్బందీగా నిర్వహించేందుకు కృషి చేస్తామని చెప్పారు. చందాలు వసూలు చేయాల్సివస్తే మూడు కుటుంబాల సమక్షంలోనే చేపడతామని ఆయన తెలిపారు.

గుగ్గిళ్ల రెడ్డిశివ

పాఠశాల ఎదుట చెత్తను తొలగించరూ..!

- అసౌకర్యానికి గురవుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

పాఠశాల ఎదుట ఉన్న చెత్తా చెదారం

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక బాలుర ఉన్నత పాఠశాల గేటు ఎదుట అపరిశుభ్రత నెలకొంది. పాఠశాల ఎదుట పచ్చటి గార్డెన్ ఉంది. గార్డెన్ ఎదుట శ్రీనాథ్ ఫంక్షన్ హాల్ ప్రతినిధి జివి.శ్రీను ప్రయాణికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు రోడ్డుపైన బస్సు కోసం నిలుచు కోకుండా సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయించారు. ఆహ్లాదకరంగా ఉండే పాఠశాల పరిసరాలను చుట్టు పక్కల నివాసముండే ప్రజలు తమ గృహాల్లోని చెత్తా చెదారాన్ని పాఠశాల ఎదుట వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు పాఠశాల ముందు భాగంలో చెత్తా చెదారం వేస్తే రూ.1000లు జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన బేఖాతరు చేస్తున్నారని అన్నారు. తిన్న ప్లేట్లను, ప్లాస్టిక్ కవర్లను, ఇంటిలో ఉన్న వ్యర్థాలను తెచ్చి అక్కడే పడవేస్తురని అంటున్నారు. పంచాయతీ అధికారులు కఠిన చర్యలు తీసుకొని పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూ రీసర్వే పక్కాగా నిర్వహించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-రామాపురం

భూ రీసర్వే పక్కాగా నిర్వహించాలని రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామ పొలంలో భూ రీ సర్వే చేస్తున్న రికార్డును మంగళవారం ఆయన పరిశీలించారు. ఎన్ని ఎకరాలు ఉన్నాయి, అందులో డ్రైలాండ్, వెట్ ల్యాండ్ విస్తీర్ణం ఎంత, రీసర్వే ఎప్పుడు మొదలుపెట్టారు. ఎన్ని బృందాలు సర్వే చేస్తున్నాయి, ఇప్పటి వరకు ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి చేశారు, ఇంకెంత చేయాలనే వివరాలను తహశీల్దార్, మండల సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. మండలంలో నల్లగుట్టపల్లి గ్రామ పొలంలో రీసర్వే ప్రక్రియ జరుగుతోందని తహశీల్దార్ రామాంజనేయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో భూ రీ సర్వే ఇంకా కొద్దిగా చేయాల్సి ఉందని ఆర్‌డిఒకు వివరించారు. ఈ గ్రామంలో రీసర్వేకు మూడు టీమ్‌లను ఏర్పాటు చేశామని అన్నారు. భూరీ సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసు కుంటామని తహశీల్దార్ సూచించారు. పిజిఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం ప్రగతిపై కూడా కలెక్టర్ సమీ క్షించి తగు సూచనలు జారీ చేశారు. వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సమద్ ఖాన్, విఆర్ఒలు, విఆర్ఎలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

భూ రీసర్వేలో ఆర్‌డిఒ శ్రీనివాస్

'మిట్స్'లో జాతీయ ఐపి యాత్రలో స్టాల్స్‌కు ఆహ్వానం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

ప్రజాశక్తి-మదనపల్లె

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మేథోసంపత్తి(ఐపి) ఆవిష్కరణ భవిష్యత్తును ఎలా రూపొందిస్తుందో అన్వేషించడానికి అంకితమైన రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. కళాశాలలోని మేథో సంపత్తి ఫెసిలిటేషన్ సెంటర్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని అన్నారు. ఈ నెల 21, 22 తేదీలలో కళాశాల ప్రాంగణంలో ఈ వర్క్‌షాప్ జరుగుతుందన్నారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం, సృజనాత్మక రచనలను రక్షించడం, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులను శక్తివంతం చేయడం లక్ష్యంగా నిర్వహిస్తునట్లు చెప్పారు. ఈ వర్క్‌షాప్ భౌగోళిక సూచికలు, ట్రేడ్‌మార్క్‌లు, కాపీరైట్‌లు, పేటెంట్‌లతో ఐపి కీలకమైన అంశాలను ఇందులో నిపుణులు వివరిస్తారని అన్నారు. నూతన ఆవిష్కరణలు ప్రదర్శన కొరకై రెండు రోజుల పాటు స్టాల్స్ ను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. స్టార్ట్ అప్ రంగం లో ఉన్న నూతన ఆవిష్కరణలను ప్రదర్శించవచ్చని ఆయన అన్నారు. స్టాల్స్ కొరకు 8712655134, 8712655132 నంబర్లను సంప్రదిచవచ్చని అన్నారు.

వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చడం హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం, అభినందనీయమని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1808లో కడప జిల్లా ఏర్పడిందన్నారు. 1812 వరకు సిద్ధవటం జిల్లా కేంద్రంగా ఉండేదన్నారు. 1812 నుంచి నేటి వరకు కడప జిల్లా కేంద్రంగా ఉందన్నారు. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి నిలయమైన తిరుమలకు తొలి గడప దేవుని కడప అన్నారు. అందువల్ల కడప జిల్లా అని పేరు పెట్టారని వివరించారు. 2005 ఆగష్టు 19న ఇంగ్లీష్‌లో ఉన్న కడప అనే స్పెల్లింగును మార్చారని తెలిపారు. కడప జిల్లా వాసి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రమాదవశాత్తూ మరణానంతరం 2010 జులై 8న ఆయన జ్ఞాపకార్థం వైఎస్ఆర్ జిల్లాగా పేరు మార్చారని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా కాకుండా వైఎస్ఆర్ కడప జిల్లాగా పేరు పెడితే సమంజసంగా ఉంటుందని అటు రాజశేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం, ఇటు తిరుమల వేంకటేశ్వర స్వామి గుర్తుగా ఉభయ తారకంగా ఉంటుందని తనతో సహా జిల్లా ప్రజలు అనేకమంది ప్రభుత్వాన్ని కోరారని గుర్తు చేశారు. దీనిపై జిల్లా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం కూడా జరిగిందని తెలిపారు. **ఖాజీపేట :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ జిల్లాను వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్పు చేస్తూ ప్రకటన చేయడం శుభదాయకమని సన్నపల్లె తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సోమల త్రివిక్రమ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడప అంటే తిరుమల తొలి గడప అని, వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కడపని జిల్లా పేరులో పునరుద్ధరణ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ప్రభుత్వ నిర్ణయం జిల్లా ప్రజల మనోభావాలను గుర్తించి మంచి నిర్ణయం తీసుకుందన్నారు.

రైతులకు పశుగ్రాస విత్తనాలను అందిస్తున్న ఎడి సుమిత్ర

పశుగ్రాస విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

స్థానిక పశు సంవర్ధక శాఖ ఆస్పత్రిలో మంగళవారం రైతులకు పశుగ్రాస విత్తనాలను ఎడి సుమిత్ర మంగళవారం పంపిణీ చేశారు. తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాలకు ఆడి రైతులు పశు మేత కోసం పశుగ్రాస విత్తనాలు 16 టన్నులు వచ్చినట్లు తెలిపారు. 5 కిలోల బస్తా 75శాతం సబ్సిడీతో రూ.85 రూపాయలకు రైతులకు పంపిణీ చేశారు. పశుగ్రాస విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని, భవిష్యత్తు వైసిపిదేనని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ పేర్కొన్నారు. మండలంలోని రేణుమాకులపల్లి పంచాయతీపల్లె కుంటపల్లికి చెందిన వైసిపి కార్యకర్త విశ్వనాథ్ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతదేహాన్ని సందర్శించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం కె. రామిగాని పల్లెలో హరి ప్రసాద్ కుమార్తె గడ్డి మాన్విత గడ్డి కత్తరించే యంత్రంలో చెయ్యి దెబ్బ తినడంతో ఆ బాలికను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తంబళ్లపల్లె ఎమ్మెల్యే స్వగృహంలో ప్రజా ప్రతినిధులు, నాయకులతో రాజకీయ పరిస్థితులు , సమస్యలు, తదితర అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన కార్యకర్తలు ఎవ్వరూ భయపడవద్దని తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. భయపడవద్దని కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, వైస్ ఎంపిపి కరీం, ఎంపిటిసి మహేష్, సర్పంచ్ లు జ్యోతి, మహమ్మద్ భాష, నాయకులు కోటిరెడ్డి, కె ఆర్ మల్ రెడ్డి, రామశంకర్‌రెడ్డి, చలపతి, శివారెడ్డి, కరీముల్లా పాల్గొన్నారు.

నేడు రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మామిడిలో పూత, పిందె దశలో సస్యరక్షణ, ఫ్రూట్ కవర్స్ వినియోగం, మార్కెటింగ్ పై అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో బుధవారం ఉద్యానవన అధికారులు ఎం.భాస్కర్, జి.సురేష్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాస్త్రవేత్తలచే రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట డివిజన్‌లోని కోడూరు, రాజంపేట నియోజకవర్గ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో కడప జిల్లా వాసి మృతి

ప్రజాశక్తి-మానపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో కడప జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు మృతి చెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మంగ ళవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు..కడపనగరం, రవీంద్రనగర్‌కు చెందిన అక్బర్ హుసేన్ కుమారులు జహీర్(27) షామీర్ స్థాని కంగా ఓ బట్టల దుకాణం నిర్వహి స్తూ జీవ నం చేస్తున్నారు. దుకాణంలోకి అవసరమైన బట్టలు కొనేందుకు కారులో బెంగళూరుకు పయనమయ్యారు. మార్గ మధ్యంలోని కురబలకోట మండలం, రామిగానిపల్లె వద్ద ఎదురుగా వచ్చిన ఆర్‌టిసి బస్సు కారు పరస్పరం ఢీకొ న్నాయి. ఈ ప్రమా దంలో జహీర్ అక్కడికక్కడే మృతి చెందగా షామీర్ తీవ్రంగా గాయపడడంతో 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.విషయం తెలుసుకున్న జహీర్ కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి కి చేరుకొని బోరున విలపించారు. మృతుడు జహీర్‌కు భార్య రుక్సానా, ఇద్దరు పిల్లలు ఉండగా ప్రస్తుతం భార్య రుక్సానా 8 నెలల గర్భిణి. భర్త మరణ వార్తను తట్టుకోలేక గుండెలవిసేలా కన్నీటి పర్యంతమైంది. ఆమెను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త మృతితో విలపిస్తున్న భార్య రుక్సానా

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

- ఇద్దరు యువకులు దుర్మరణం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటిఎం మండలంలోని బూర్లపల్లి కోళ్లఫారం వద్ద ఘటన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..బి.కొత్తకోట మండలం ఎస్‌సి కాలనీలో నివాసమున్న దండు శంకర కుమారుడు శ్రీనివాసులు(22), అదే కాలనీకి చెందిన మరో యువకుడు చందు(22) బి.కొత్తకోటలో సినిమాకు వెళ్లి బైక్‌పై వెళుతుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనం వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టిందని తెలిపారు. సంఘటన స్థలంలోనే శ్రీనివాసులు మృతి చెందగా చందుఅనే యువకుడు మదనపల్లి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఎస్ఐ హరిహరప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తామని తెప్పారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

కారు బోల్తా : కర్ణాటక వాసులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

గుర్రంకొండ మండలంలోని చెర్లోపల్లి వద్ద మంగళవారం ఓమిని కారు బోల్తా పడటంతో పది మంది కర్ణాటక భక్తులకు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితుల కథనం మేరకు.. కర్నాటక రాష్ట్రం, దేవనహళ్లికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు నంజుడప్ప, హేమలత, నంజమ్మ, ప్రకాష్, వనజ, చందు, పెద్ద నంజమ్మ, భ్రమరాంబ, నాగరత్నమ్మ, మంజుల దైవ దర్శన నిమిత్తం రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయానికి దైవ దర్శనానికి బయల్దేరారు. మార్గమధ్యంలోని చెర్లోపల్లి వద్ద ముందు వెళుతున్న ద్విచక్రవాహనం కింద పడడంతో దానిని తప్పించే క్రమంలో వీరు ప్రయాణిస్తున్న మినీ కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న పదిమంది గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నంజుడప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరు కు రెఫర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుర్రంకొండ ఎస్ఐ. మధు రామచంద్రుడు తెలిపారు.